అందరి సహకారంతోనే అవార్డు

రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్

మాట్లాడుతున్న రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్

ఎదులాపురం, జూన్ 6 : రిమ్స్ వైద్యులు, ఉద్యోగులు, సిబ్బంది సహకారంతోనే రిమ్స్‌కు గ్రీన్ చాంపియన్ అవార్డు వచ్చిందని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. ఈ మేరకు గురువారం తన చాంబర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సక్రమంగా ఉండడంతో అవార్డు దక్కిందని తెలిపారు. పారిశుధ్యం, పచ్చదనం, అంటువ్యాధుల నివారణకు తీసుకుం టున్న చర్యల ఫలితంగా రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి అవార్డుకు ఎంపిక చేసిందన్నారు. వైద్య సిబ్బందికి, పారిశుధ్య కార్మికులకు, నర్సులకు మెడికల్ వేస్ట్‌పై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌కు సిబ్బంది, వైద్యులు పుష్పగుచ్ఛం అందించారు.

గుట్కా విక్రయదారులపై ఉక్కుపాదం

- తయారు చేసిన, అమ్మిన వారిపై కేసు
- వారం రోజుల్లో రూ.20 లక్షల నిషేధిత గుట్కా స్వాధీనం
- డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి

నిషేధిత గుట్కా, కల్తీ తంబాకును చూపిస్తున్న డీఎస్పీ

ఎదులాపురం, జూన్ 6 : రాష్ట్ర ప్రభుత్వం నిషేధించిన పొగాకు ఉత్పత్తులు, గుట్కాను తయారు చేసిన, నిల్వ ఉంచిన, అమ్మిన వారిపై ఉక్కుపాదం మోపుతామని, కేసులు కూడా నమోదు చేస్తున్నామని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం ఆదిలాబాద్ పట్ట ణంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ఆదిలాబాద్ డివిజన్‌లో వారం రోజుల్లో రూ.20 లక్షల విలువ గల నిషేధిత గుట్కాను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశామన్నారు. ఇక్కడ సీఐ ఏ.అశోక్, ఎస్ఐలు లాలసింగ్‌నాయక్, కరీం, ఐడీ పార్టీ నరేశ్, రమేశ్, క్రాంతి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.


డాక్టర్ చంద్రిక అవినాష్‌ను సన్మానిస్తున్న వాసవి యాజమాన్యం

యోగా, వ్యాయామంతో ఒత్తిడి లేని జీవితం

మిస్సెస్ వరల్డ్ పీస్ విన్నర్ డాక్టర్ చంద్రిక అవినాష్

నిర్మల్ అర్బన్, జూన్ 6 : యోగా, వ్యాయామంతో ఒత్తిడి లేని జీవితాన్ని గడపవచ్చని మిస్సెస్ వరల్డ్ పీస్ ఇంటర్నేషనల్-2024 అందాల పోటీ విజేత డాక్టర్ చంద్రిక అవినాష్ అన్నారు. ఇటీవల హర్యానాలోని గుర్గాన్‌లో నిర్వహించిన అందాల పోటీల్లో వివిధ రాష్ట్రాల నుంచి 140 మంది పాల్గొనగా.. ఇందులో ప్రతిభ కనబర్చి విన్నర్‌గా నిలిచారు. ఈ సందర్భంగా పట్టణంలోని తన్వి బ్యాంకెట్ హాల్‌లో గురువారం వాసవి విద్యా సంస్థల ఆధ్వర్యంలో చంద్రికను మెమెంటో, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా చంద్రిక మాట్లాడుతూ.. సమాజంలో ఇరుగుపొరుగు వారితో సత్సంబంధాలు నెలకొల్పుతూ సంతోషంగా గడపడం ద్వారా ఒత్తిడికి దూరమవుతుందని అన్నారు. అనంతరం వాసవి పాఠశాల పూర్వ విద్యార్థులు నీట్ జాతీయ స్థాయిలో మంచి ర్యాంకులు సాధించిన దీక్షిత, విష్ణేశ్, శ్రీనికేత్, నితీశ్‌రెడ్డి, ప్రహర్ష, నిధి రెడ్డిలను అభినందించారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ జగదీశ్‌రెడ్డి, కరస్పాండెంట్ పోతారెడ్డి, ప్రిన్సిపాల్ రాజ్ కుమార్, శ్రీనివాస్, శైలజాయ్‌సన్ పాల్గొన్నారు.

చేపల చెరువుతో లాభం

కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

సోన్, జూన్ 6 : రైతులు చేపల చెరువును ఏర్పాటు చేసుకోవడం వల్ల లాభాలను పొందవచ్చని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. ఈజీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేపల చెరువును గురువారం నిర్మల్ మండలంలోని కొండాపూర్‌లో గల మండల సమాఖ్య వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. రైతులు చేపల చెరువు ఏర్పాటు చేసుకోవడం వల్ల లాభాలను పొందవచ్చని తెలిపారు. ఇక్కడ ఏర్పాటు చేసిన విధంగానే ప్రతి మండలానికి 30 మంది రైతులను గుర్తించి చేపల చెరువు ఏర్పాటు దిశగా ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో విజయలక్ష్మి, అడిషనల్ ఇన్‌చార్జి డీఆర్‌డీవో రాజేశ్వర్ పాల్గొన్నారు.

పలకరించిన తొలకరి.. పులకించిన రైతన్న..

- వ్యవసాయ పనులకు సన్నద్ధమవుతున్న రైతులు
- ఆదిలాబాద్ జిల్లాలో 5.50 లక్షల ఎకరాల్లో సాగు

దుక్కి దున్నుతున్న రైతు

ఆదిలాబాద్, జూన్ 6(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లా రైతాంగం వానకాలం సాగుకు సన్నద్ధమవుతున్నారు. గురువారం జిల్లా వ్యాప్తంగా వర్షం పడడంతో విత్తనాలను విత్తేందుకు పొలంబాట పట్టారు. ఈ ఏడాది ముందుగానే వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారుల సూచనల మేరకు తొలకరి పలకరించింది. ఆదిలాబాద్ జిల్లాలో ఈ ఏడాది 5.50 లక్షల ఎకరాల్లో సాధారణ సాగు ఉంటుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. ఇందులో పత్తి 4.16 లక్షల ఎకరాలు, సోయా 91,762, కంది 61,246, వరి 1821, పెసర్లు 667, మినుములు 850 ఎకరాల్లో సాగు చేయనున్నట్లు అంచనా వేశారు. పత్తి విత్తన విక్రయాలు పూర్తికాగా.. సోయా, కంది విత్తనాలను రైతులు కొనుగోలు చేస్తున్నారు. రైతులు అధికంగా ఆర్‌సీహెచ్ 659 పత్తి విత్తనాల కోసం ఇబ్బందులు పడగా.. అధికారులు స్పందించి అవసరమైన విత్తనాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. నకిలీ విత్తనాల అమ్మకాలను నిరోధించడానికి టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసి విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. రైతులకు విత్తనాల, ఎరువుల సమస్య లేకుండా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయంలో హెల్ప్‌లైన్ నంబర్లను అందుబాటులోకి తీసుకొచ్చారు.

90 వేల టన్నుల ఎరువులు

వానకాలం సాగులో భాగంగా 90 వేల మెట్రిక్ టన్నుల వివిధ రకాల ఎరువులు అవసరమవుతాయని అధికారులు గుర్తించారు. పంటలకు అనుగుణంగా ఎరువులను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. రైతులు ఎక్కువగా యూరియాతోపాటు కాంప్లెక్స్ ఎరువులను వినియోగిస్తారు. ఈ సీజన్‌లో యూరియా 30 వేల టన్నులు, డీఏపీ 13 వేలు, ఎంవోపీ 7 వేలు, ఎస్‌పీకే ఎస్ 36 వేలు, ఎస్ఎస్‌పీ 4 వేల టన్నుల విని యోగం జరిగే అవకాశాలున్నాయి. వివిధ రకాల ఎరువులు ర్యాక్‌ల ద్వారా జిల్లా కేంద్రానికి చేరుతుండగా పంపిణీ కేంద్రాలకు సరఫరా చేస్తున్నారు. నెలలవారీగా రైతులకు అవసరమైన ఎరువులను ఆగ్రోస్, ప్రాథమిక సహకార సంఘాలు, లైసెన్స్ కలిగిన ప్రైవేటు వ్యాపారుల ద్వారా విక్రయిస్తున్నారు. రైతులు ఎరువులను కొనుగోలు చేసి పంటలకు అవసరమైన సమయంలో వేసేందుకు తమ ఇండ్లలో నిల్వ ఉంచుకుంటున్నారు.

బాదనకుర్తి కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతులు

వర్షార్పణం

- ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో వర్షం
- తడిసిముద్దయిన ఆరబెట్టిన ధాన్యం
- తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి : రైతులు

దస్తురాబాద్/ఇచ్చోడ/తాంసి, జూన్ 6 : ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో గురువారం భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురియడంతో అన్నదాతలు పొలం బాట పట్టారు. పంట పొలాల్లో నీరు నిలిచింది. రహదారులు జలమయం అయ్యాయి. వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఉపశమనం పొందారు.

ఖానాపూర్‌లో తడిసిన ధాన్యం

ఖానాపూర్ రూరల్, జూన్ 6 : ఖానాపూర్ మండలంలో గురువారం కురిసిన వర్షానికి పలు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయింది. ఒకవైపు తూకం వేసిన ధాన్యం తరలించకుండానే తడిసిందని ఆందోళన చెందుతున్నారు. పదిహేను రోజులుగా తూకం వేసే వాళ్లు కరువయ్యారు. తడిసిన ధాన్యాన్ని తూకం వేయాలని సూర్జాపూర్, బాదనకుర్తి గ్రామాల రైతులు తుప్ప చిన్నరెడ్డి, మారవేణి శంకర్, అడ్వాల సాయిరాజు, అంబటి చిన్న భూమ నర్సయ్య, రాకేశ్, ఒడ్నాల నాగరాజు, పాల సతీశ్, పాదం తిరుపతి, బండి లింగ గౌడ, గొండ సురేశ్, గురువయ్యలు డిమాండ్ చేస్తున్నారు. నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

పిడుగు పాటుకు రెండు ఆవులు మృతి

నార్నూర్, జూన్ 6 : నాగల్‌కొండకు చెందిన రైతు రాథోడ్ జైవంత్‌రావుకు చెందిన రెండు ఆవులు పిడుగుపాటుకు మృత్యువాత పడ్డాయి. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. ఉమ్మడి మండలంలో గురువారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఈ క్రమంలో వ్యవసాయ పొలంలో ఆవులు మేత మేస్తూ ఉండగా ఒక్కసారిగా రెండు ఆవులపై పిడుగు పడడంతో మృత్యువాత పడ్డాయి. వీటి విలువ సుమారు రూ.80 వేల వరకు ఉంటుందని రైతు తెలిపాడు. ప్రభు త్వం పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

పిడుగుపాటుకు నలుగురు బలి

- ఇంద్రవెల్లిలో భార్యాభర్తలు
- దిలావర్‌పూర్‌లో యువరైతు
- తానూర్‌లో మేకల కాపరి

అనక సంతోష్, స్వప్న(ఫైల్)

ముడపల్లి ప్రవీణ్(ఫైల్)

మాగీర్వాడ్ శ్రీ

దిలావర్‌పూర్/తానూర్/ఇంద్రవెల్లి, జూన్ 6 : నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలంలోని కాల్వ గ్రామానికి చెందిన యువరైతు ముడపల్లి ప్రవీణ్(26), తానూర్ మండలంలోని ఎల్వత్ గ్రామానికి చెందిన మాగీర్వాడ్ శ్రీ(10), ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని డోంగర్‌గాంలో డోంగర్‌గాం గ్రామానికి చెందిన అనక సంతోష్(27), ఆయన భార్య స్వప్న(24) పిడుగుపాటుకు మృతి చెందారు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. గురువారం సాయంత్రం సంతోష్-స్వప్న దంపతులు కలిసి వ్యవసాయ పనులకు వెళ్లారు. అదే సమయంలో ఈదురు గాలులతోపాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురువడంతో టెకు చెట్టు కింద ఉన్న గుడిసేలోకి తలదాచుకున్నారు. ఇంతలో గుడిసేతోపాటు టెకు చెట్టుపై పిడుగు పడడంతో భార్యాభర్తలు సంతోష్, స్వప్న అక్కడికక్కడే మృతి చెందారు. వ్యవసాయ పనులకు వెళ్లిన వారు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చేను వద్దకు వెళ్లి చూడగా.. గుడిసెలో భార్యాభర్తల మృతదేహాలు కనిపించాయి. వీరికి యేడాది పాప భాను ఉంది.

దిలావర్‌పూర్‌లో రైతు..

కాల్వలో రెండు రోజుల క్రితం ఇదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ప్రవీణ్ తన చేనులో జిలుగ విత్తనాలు చల్లడానికి గురువారం ఉదయం వెళ్లాడు. మధ్యాహ్నం వరకు విత్తనాలు చల్లుతున్నాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా భారీ శబ్దంతో పిడుగు అతనిపై పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రవీణ్ చేనులో వ్యవసాయ పనులు చేస్తున్న సమయంలో తన ప్యాంటు జేబులో మొబైల్ ఫోన్ ఉందని, సెల్‌ఫోన్ నెట్‌వర్క్‌తో పిడుగు అతనికి తగిలి మృతి చెంది ఉంటాడని గ్రామస్తులు తెలిపారు. ప్రవీణ్‌కు భార్య అశ్విని, యేడాది పాప శ్రీనిక ఉంది. అతని తండ్రి సాయన్న ఫిర్యాదు మేరకు పోలీసులు పంచనామా నిర్వహించారు.

తానూర్‌లో మేకల కాపరి..

ఎల్వత్ గ్రామానికి చెందిన మాగీర్వాడ్ శ్రీ(10) పిడుగు పాటుతో మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. సాయినాథ్-కవిత దంపతులకు శ్రీనివాస్, శ్రీ, సరస్వతీ ఉన్నారు. ఇందులో చిన్నవాడైన శ్రీ ఉదయం పది గంటలకు మేకలను మేపడానికి ఎల్వత్ గ్రామ శివారులోకి వెళ్లాడు. మధ్యాహ్నం 2 గంటలకు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ క్రమంలో పిడుగు పడడంతో ఒక్కసారిగా బాలుడు అక్కడికక్కడే మృతిచెందాడు. శ్రీ తండ్రి సాయినాథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సందీప్ పేర్కొన్నారు.

పగిలిన సెల్‌ఫోన్

నమస్తే తెలంగాణ
విలేకరులు కావలెను
అర్హతలు :
- పాత్రికేయులుగా పనిచేయాలన్న ఉత్సాహం.
- మీ ప్రాంత స్థితిగతులపై అవగాహన.
- తెలుగు భాషపై పట్టు ఉండి.. చక్కగా రాయగలగాలి.
- ఇంటర్ ఉత్తీర్ణత సాధించి.. 30 ఏళ్లలోపు ఉండాలి.
- రిపోర్టింగ్‌పై ఆసక్తి ఉన్నవారురాత పరీక్ష, ఆ తర్వాత ఇంటర్వ్యూలకు హాజరుకావాలి.
- బయోడాటాతో రెండు పాస్ పోర్ట్ సైజు ఫొటోలు తెచ్చుకోగలరు.
- తెలుగు టైపింగ్ వచ్చిన వారికి ప్రాధాన్యం.
నిర్మల్‌కు కావలసిన కేంద్రాలు
1. నిర్మల్ టౌన్ 2. నిర్మల్ శివాజీచౌక్ 3. మామడ
ఆదిలాబాద్‌కు కావలసిన కేంద్రాలు
1. ఆదిలాబాద్ టౌన్ 2. ఆదిలాబాద్ రూరల్ 3. మావల
4. ఉట్నూర్‌టౌన్ 5. తలమడుగు 6. జైనథ్ రూరల్
రాతపరీక్ష తేదీ : 11-06-2024 (మంగళవారం)
సమయం : ఉదయం 11 గంటలకు..
నిర్మల్ పరీక్షా స్థలం : వశిష్ట డిగ్రీ కళాశాల, భాగ్యనగర్ కాలనీ, బైంసా రోడ్, నిర్మల్
ఆదిలాబాద్ పరీక్షా స్థలం : టీఎన్‌జీవో భవన్, ఆదిలాబాద్
ఫోన్ నంబర్లు : 9440383136, 9182777993, 9182777029

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి

సోన్, జూన్ 6 : బడిఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. గురువారం నిర్మల్ మండలంలోని అక్కాపూర్ గ్రామంలో గల ప్రాథమికోన్నత పాఠశాలలో జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని డీఈవో రవీందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. మహిళా సమాఖ్య సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జూన్ 6 నుంచి 19వ తేదీ వరకు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించి అత్యధిక నమోదును సాధించాలని సూచించారు. బడిఈడు పిల్లలు, బడి బయట పిల్ల లు, బాల కార్మికులను గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని సూచించారు. సభ్యులతో ప్రతిజ్ఞ చేయించారు. గ్రూప్ సభ్యులు కుట్టించి తెచ్చిన ఒక జత ఏక రూప దుస్తులను కలెక్టర్ చేతుల మీదుగా హెచ్ఎంలకు అందించారు. అనంతరం బడిబాట ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, చిన్న చిన్న మరమ్మతులను పరిశీలించి పాఠశాలకు అవసరమైన పనులను ఎస్టిమేట్ వేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గజానన్‌రావు, ఆర్‌అండ్‌బీ ఈఈ అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

వైద్యుల సలహాలు పాటించండి..

అడిషనల్ ఎస్పీ సురేందర్‌రావు

మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఏఎస్పీ సురేందర్‌రావు

గుడిహత్నూర్, జూన్ 6 : వైద్యుల సలహాలు పాటించి ఆరోగ్యాన్ని మెరుగు పర్చుకోవాలని అడిషనల్ ఎస్పీ సురేందర్ రావు సూచించారు. గుడిహత్నూర్ మండలంలోని సూర్యగూడ గ్రామంలో గురువారం పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఉచిత మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య విషయంలో జాగ్రత్తగా ఉండాలని, చిన్నచిన్న వ్యాధులేనని నిర్ల క్ష్యం చేయకుండా వైద్యులకు చూపించుకుని తగిన మందులు వాడాలన్నారు. వైద్య శిబిరాన్ని విశేష స్పందన రావడంపై పోలీసు సిబ్బందిని ఆయన అభినందించారు. డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కలుషిత నీరు, దోమల వల్ల రోగాలు వచ్చే అవకాశం ఉందని, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ శిబిరంలో సుమారు 500 మంది వైద్య పరీక్ష లు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉ ట్నూర్ డీఎస్పీ నాగేందర్, వర్టికల్ డీఎస్పీ శ్రీనివాస్, సైబర్ క్రైం డీఎస్పీ హసిబుల్లా, ఇచ్చోడ సీఐ భీమేశ్, గుడిహత్నూర్, ఇంద్రవె ల్లి, నేరడిగొండ ఎస్ఐ లు సయ్యద్ ఇమ్రాన్, సునీల్, శ్రీకాంత్, మండల మెడికల్ ఆఫీసర్ శ్యాంసుందర్, ప్రీతల్, రాజు, పాల్గొన్నారు.